సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 5 । జూలై । 2025



బాబు మోసంపై ఇంటింటా ప్రచారం

గ్రామం, వార్డులలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'పై ఇంటింటికీ వెళ్లి తెలపాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. -8లో



ఆలోచనకు పదును... సృజనకు అదును

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. సెప్టెంబర్ 15 వరకు గడువు ఉంది. -8లో

గరిష్టం/కనిష్టం
36.6/27.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.4 - 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 27.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

6 నుంచి డీఈఈ సెట్ కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: డీఈఈ సెట్ ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులకు ఈ నెల 6 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని డీఈఓ షేక్ షంషుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6,7 తేదీల్లో మొదటి దశ కౌన్సెలింగ్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 8 నుంచి 12 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ ఎంచుకోవచ్చన్నారు. 13 నుంచి 16 వరకు సీట్ల కేటాయింపు, ప్రొవిజినల్ అడ్మిషన్ లెటర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. 17 నుంచి 22 వరకు డైట్స్‌లో సర్టిఫికెట్ల పరిశీలన, చివరి అడ్మిషన్ లెటర్ ఇవ్వనున్నట్లు వివరించారు. పైన తెలిపిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

నేడు లోక్ అదాలత్

కడప అర్బన్: 'జాతీయ లోక్ అదాలత్'ను వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో శనివారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 6, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 3, రాయచోటిలో 3, బద్వేల్‌లో 3, లక్కిరెడ్డిపల్లి, రైల్వేకోడూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టులలో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్స్: 08562 258622, 244622ను సంప్రదించాలని వివరించారు.

29న ఈశ్వరీదేవి జయంత్యుత్సవం



బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవిమఠం

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంలో మాతాశ్రీ ఈశ్వరీదేవి 322వ జయంత్యుత్సవాలను ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఈశ్వరీదేవి మఠం ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అమ్మవారి భక్తులు ముందుకు రావాలని ఆయన కోరారు. మఠాధిపతి శ్రీ వీరకుమారస్వామి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. అమ్మవారికి ప్రత్యేక ఉత్సవాల కోసం భక్తులు సెల్ నంబర్: 9490486064కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలని వివరించారు.

భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ తొలగింపు

కడప ఎడ్యుకేషన్: భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీగా పని చేస్తున్న ప్రమీలను ఆ పదవి నుంచి తొలగించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఆమె స్థానంలో తాను జిల్లా కార్యదర్శిగా అదనపు బాధ్యతలు చేపట్టానన్నారు. గతంలో నిర్వహించిన సమావేశంలో కార్యదర్శిగా పని చేస్తున్న ప్రమీలపై సభ్యులంతా ఫిర్యాదు చేశారన్నారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరు కాకపోవడంతో సభ్యుల ఆమోదం మేరకు పదవి నుంచి తొలగించినట్లు తెలిపారు.

పంటల బీమా.. రైతుకు ధీమా



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జిల్లా అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: బీమా పంటలకు రక్షణ కవచం లాంటిదని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్లు, కరువులు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం వస్తుందన్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులకు సైతం బీమా అందుతుందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు చంద్రానాయక్, రవిచంద్రబాబు, ఎల్‌డీఎం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సొరంగం.. మార్గం సుగమం

కడప మీదుగా వెళ్లే జాతీయ రహదారి -40 మార్గంలో కీలకమైన గువ్వల చెరువు ఘాట్ ఉంది. ఇక్కడ ప్రమాదకర మలుపులు ఉన్నందున.. తరచూ ఏదో ఒక సంఘటన జరుగుతూ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా ఇక్కడ సొరంగ మార్గానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తద్వారా సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమం అయింది. దీంతో ఎన్నో ఏళ్ల నాటి కల త్వరలో సాకారం కానుంది. అలాగే అందమైన కొండల మధ్య సొరంగ మార్గం ఏర్పాటు కావడంతో.. ఆ ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది.

- గువ్వల చెరువు ఘాట్‌లో ఏర్పాటుకు చర్యలు
- రూ.920 కోట్ల అంచనా వ్యయం
- మొత్తం 7 కిలోమీటర్ల దారి
- అందులో 3 కి.మీ సొరంగం
- టన్నెల్‌తో ప్రమాదాలకు అడ్డుకట్ట
- వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడే ప్రతిపాదనలు



కడప రూరల్: కర్నూలు, చిత్తూరు మధ్యలో కడప అనుసంధానంగా ఉండే జాతీయ రహదారి-40 మార్గం ఎంతో కీలకమైనది. ఈ ఘాట్ కడప నగరానికి దాదాపు 15 కిలో మీటర్ల దూరంలో ఉంది. వాహనదారులు, ముఖ్యంగా భారీ వాహనదారులు ఈ ప్రమాదకర మలుపుల్లో వెళ్లాలంటే చాలా అప్రమత్తంగా ఉండాలి.

నాలుగు వరసల రహదారి..

కేంద్ర ప్రభుత్వం ఇటీవలనే కడప గువ్వల చెరువు ఘాట్ వద్ద ప్రమాదాల నివారణకు, సురక్షిత ప్రయాణానికి సొరంగ మార్గం నిర్మించాలని సంకల్పించింది. ఆ మేరకు అంచనా వ్యయం రూ.920 కోట్లుగా నిర్ణయించింది. ఇక్కడ ప్రస్తుతం వాహనాలు రాకపోకలు సాగించడానికి దాదాపు 30 అడుగుల రహదారి ఉంది. సొరంగ మార్గం నిర్మించే ప్రాంతంలో కడప వైపు నుంచి చిన్న బిడికి గ్రామం వద్ద నుంచి.. ఘాట్‌కు ఆవలి వైపు ఉన్న గువ్వలచెరువు ప్రాంతం వరకు దాదాపు 7-8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మధ్యలో సొరంగ మార్గం (టన్నెల్) దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఉండనుంది. అంటే మొత్తం 7-8 కిలో మీటర్ల వరకు (సొరంగ మార్గంతో కలిపి) వాహనాలు రాకపోకలు సాగించడానికి నాలుగు వరుసల రహదారులను నిర్మించనున్నారు. ఈ టన్నెల్‌ను ఏ ప్రాంతంలో ఏర్పాటు చేసేది అత్యున్నత స్థాయి నిపుణులు నిర్ధారించాల్సి వుంది. ఇప్పటికే ఢిల్లీ నుంచి నేషనల్ హైవే టన్నెల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌తో మరి కొంత మంది నిపుణులు ఇక్కడికి వచ్చి.. ప్రాథమికంగా ఈ ప్రాంతాలను పరిశీలించి వెళ్లినట్లుగా తెలిసింది. కాగా ఈ మార్గానికి అటవీ, పర్యావరణ తదితర శాఖల నుంచి అనుమతులు రావాల్సి వుంది.



గువ్వలచెరువు ఘాట్ ప్రాంతంలో పరిశీలిస్తున్న ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణుల బృందం (ఫైల్)

హాయిగా.. సురక్షితంగా..



పవిత్రమైన, సుందరమైన శేషాచలం అటవీ కొండలు, పాలకొండల సముదాయంలో గువ్వలచెరువు ఘాట్ ఉంది. ఈ ప్రాంతం అందమైన అటవీ ప్రాంతం, వర్షాకాలంలో ఎటు చూసి నా పచ్చదనం .. జలపాతాల సోయ గాలు కనువిందు చేస్తుంటాయి. అలాంటి ప్రకృతి మధ్య సొరంగ మార్గం ఏర్పాటు కావడంతో.. ఆ ఏరియా అంతా పర్యాటక ప్రాంతంగా మారే అవకాశం ఉంది. ఈ మార్గం గుండా ఇప్పటికే హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వాపార, వ్యవసాయ రంగానికి సంబంధించి ఉత్పత్తులు రవాణా అవుతున్నాయి. ఉదాహరణకు మన జిల్లా నుంచి సిమెంట్, మైనింగ్, అరటి, బత్తాయి తదితర వస్తువులు గువ్వలచెరువు ఘాట్ మీదుగా పీలేరు, చిత్తూరు, చెన్నై, మదనపల్లె, బెంగళూరు తదితర ప్రాంతాలకు రవాణా అవుతున్నాయి. చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఫ్యాక్టరీలకు మిషనరీ, ఇతర పరిశ్రమలకు సంబంధించిన విడి భాగాలు, కెమికల్స్‌తోపాటు టమోటా తదితర కూరగాయలు, కొబ్బరి బొండాలు.. ఇలా పలు రకాల వస్తువులు భారీ వాహనాల్లో వస్తుంటాయి. వీటిలో కొన్ని వివిధ కారణాల చేత ఘాట్ మలుపుల్లో చిక్కుకొని ప్రమాదాలకు గురి అవుతున్నాయి. సొరంగ మార్గం ఏర్పాటైతే దాదాపు ఒక గంట ప్రయాణం కలిసి రావడంతో పాటు సుఖంగా.. సురక్షితంగా ప్రయాణం సాగించడానికి వీలుకలుగుతుంది.

నాడే ప్రతిపాదనలు

ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలోనే పలు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఎన్నో చారిత్రాత్మక పథకాలను అమలు చేశారు. జాతీయ రహదారులతోపాటు జిల్లా, గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. అందులో భాగంగానే గువ్వలచెరువు ఘాట్‌లో సొరంగ మార్గానికి ప్రతిపాదనలు పంపారు. కాగా వైఎస్సార్ మరణానంతరం ఈ పనులు ముందుకు సాగలేదు.

మలుపుల్లో తరచూ మృత్యు ఘంటికలు

ఇక్కడ బ్రిటీష్ హయాంలో రోడ్డును నిర్మించారు. ఈ ఘాట్ మార్గంలోనే ఇప్పుడూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఒక అంచనా ప్రకారం ఈ మార్గంలో నిమిషానికి ఒక వాహనం వెళ్తోంది. పలు రకాల వాహనాలు ముఖ్యంగా భారీ వాహనదారులకు ఈ ఘాట్ విషమ పరీక్షను పెడుతుంది. ఇక్కడ అత్యంత జాగ్రత్తగా వాహనం నడపకపోతే ప్రమాదం జరుగుతుంది. ఒక అంచనా ప్రకారం ఒక నెలలో 2-3 ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రాణ నష్టం కూడా సంభవిస్తుంటుంది. కడప వైపు నుంచి ప్రయాణించే ఘాట్‌లో ఉండే.. శ్రీ ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న మలుపు, ఆ పైన ఉన్న మలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గువ్వలచెరువు నుంచి కడప వైపు వచ్చే మార్గంలో మొదటి మలుపు వద్ద కూడా ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఇలా మలుపుల వద్ద తరచూ మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. ఈ ప్రమాదాలకు సొరంగ మార్గంతో దాదాపుగా అడ్డుకట్ట పడే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

నిపుణులు పర్యవేక్షించాలి

గువ్వల చెరువు ఘాట్‌లో ప్రాథమికంగా నిపుణుల బృందం టన్నెల్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించాల్సి వుంది. అలాగే అంచనా వ్యయంపై ఒక నిర్ణయానికి రావాలి. సాంకేతిక సమస్యలను అధిగమించాక కేంద్రం తగు నిర్ణయం తీసుకుంటుంది.

-సి.విజయభాస్కర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జాతీయ రహదారులు భవనాల శాఖ కడప.

తొలి అడుగులో టీడీపీ నేతల నిలదీత



టీడీపీ నేతలను నిలదీస్తున్న ప్రజలు



రోడ్డుపై నిలిచిన మురికి నీరు

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరిన ప్రజలు

ప్రొద్దుటూరు: మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ ఆచార్ల కాలనీలో శుక్రవారం టీడీపీ నేతలు 'సుపరిపాలనలో తొలి అడుగు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు టీడీపీ నేతలను నిలదీశారు. చాలా రోజులుగా సిమెంటు రోడ్డుపై వర్షపు నీళ్లు నిలుస్తున్నాయని, డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలిపారు. పలుమార్లు ఈ సమస్యను పరిష్కరించాలని కోరినా స్పందించలేదని టీడీపీ నేతలపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. స్థానికులు నిలదీయడంతో దిక్కుతోచని నేతలు.. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సౌమ్యనాథుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు




ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి

నందలూరు: నందలూరులోని సౌమ్యనాథ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం అంకురార్పణ చేపట్టారు. ముందుగా సాయంత్రం 6 గంటల నుంచి పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. అర్చకులు నవధాన్యాలు, కలశస్థాపనలు, పూర్ణకుంభ ప్రతిష్ఠ, పుణ్యాహవచనా బియ్యం, నెయ్యి, బెల్లం, టెంకాయలు, తమలపాకులు సమకూర్చారు. పాంచరాత్ర ఆగమ పండితుల బృందంతో కలశస్థాపన చేసి హోమం నిర్వహించారు. ఆగ్నేయమూలలో వెలసి ఉన్న పుట్ట వద్ద పూజలు జరిపారు. పుట్టమన్ను సేకరించి అంకురార్పణ మంటపంలో ఏర్పాటు చేసిన 12 పాలికలలో ఉంచారు. అందులో నవధాన్యాలు చల్లి అంకురింపచేసే కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూలవర్లు, ఉత్సవర్లకు తిరుమంజనం కార్యక్రమం జరిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రికి యాళి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

షేమ్.. షేమ్!

- అధికార దర్పానికి జీ హుజూర్ అంటున్న అధికారులు
- కమలాపురం ఎమ్మెల్యే ఇంటి ప్రాంగణంలో సమీక్షకు హాజరైన అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాల్లో కాకపోయినా పరుగెత్తికెళ్లిన వైనం
- నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమాలోచనలు
- పుత్తా డైరెక్షన్‌లో కొనసాగిన సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్‌ఇర్వీన్, చిత్రంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



మాచిరెడ్డిపల్లెలో కమలాపురం నియోజకవర్గ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికార దర్పానికి సెల్యూట్ చేస్తున్న వారు కొందరైతే.. 'నీ బాంఛన్ దొర' అనే వారు మరికొందరయ్యారు. పోస్టింగ్స్ కోసం స్థాయిని దిగజార్చుకొని ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంతో నిమిత్తం లేదు, ఎక్కడ సమీక్ష పెట్టినా మీరు ఆదేశిస్తే వచ్చి తీరుతామంటూ తలూపుతున్నారు. అధికార పార్టీ నేతలు ఆదేశించిందే శాసనం, చెప్పిందే వేదమని చెప్పకనే చెబుతున్నారు. ఈక్రమంలో మాచిరెడ్డిపల్లె చెట్ల కింద సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తే.. పరుగుపరుగునా అధికారులు వాలిపోయారు. ఈ దుస్థితికి వ్యవస్థలను దిగజార్చిన అధికారులు 'షేమ్..షేమ్' అని ప్రజాస్వామ్యవాదులు హేళన చేస్తున్నారు.

- కమలాపురం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించేందుకు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సిద్ధమయ్యారు. ఆమేరకు శుక్రవారం మాచిరెడ్డిపల్లెకు రావాల్సిందిగా అధికారులకు కబురు పంపారు. జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారుల సమక్షంలో సమీక్ష చేపట్టే అవకాశం ఉంది. అలా కాదు, కూడదంటే.. నియోజకవర్గ కేంద్రమైన కమలాపురంలో కూడా చేపట్టవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలతో నిమిత్తం లేకుండా ఎమ్మెల్యే పుత్తా ఇంటి ప్రాంగణంలో సమీక్ష నిర్వహించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించే వారు, ఇలాంటి చర్యలకు ఉపక్రమించరని పలువురు దెప్పి పొడుస్తున్నారు. మాచిరెడ్డిపల్లెలో చెట్ల కింద సమీక్ష నిర్వహించడం ఏమిటని అభ్యంతరం చెబుతున్నారు.

ప్రగతి పేరిట పెత్తనం

కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అభివృద్ధిపై సమీక్ష చేపట్టడం సముచితమే. కాకపోతే ఇంటి ప్రాంగణంలో సమీక్ష నిర్వహించడమే తీవ్ర అభ్యంతరకరమని పలువురు వివరిస్తున్నారు. అదే సమీక్ష ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించి.. ఇతర ప్రజా ప్రతినిధులను కూడా ఆహ్వానించించి వారి సలహాలు, సూచనలు తీసుకొని ఉంటే హుందాతనం లభించేది. అలా కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థపై గౌరవం లేకపోగా తాను చెప్పిందే వేదమన్నట్లుగా.. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డితో సమీక్ష చేయించడాన్ని పలువురు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఎలాంటి అధికారిక హోదా లేకపోయినా.. పుత్తా నరసింహారెడ్డి ఆర్డీఓ జాన్‌ఎర్వీన్‌తో సమానంగా కూర్చొని అధికారులను ప్రశ్నించారని విపక్ష పార్టీ నేతలు నిలదీస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగా అధికారులు వ్యవహరించకపోవడం, మాచిరెడ్డిపల్లెలో సమీక్షకు వెళ్లడంపై సర్వోన్నతాధికారి అభ్యంతరం చెప్పకపోవడంపై విశ్లేషకులు హేళన చేస్తుండటం గమనార్హం.

జన్ సురక్ష పథకాలపై విస్తృత అవగాహన

కడప సెవెన్‌రోడ్స్: ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జన్ సురక్ష పథకాలపై జిల్లా వ్యాప్తంగా ఈ నెల ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో భాగంగా జూలై 23, 30, ఆగస్టు 6 తేదీలలో ప్రతి గ్రామ స్థాయిలో సమావేశాల నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం జనార్దన, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు చంద్రనాయక్, రవి చంద్రబాబు, ఆర్‌ఎం యూనియన్ బ్యాంక్ లక్ష్మీ తులసి, నాబార్డ్ డీడీఎం విజయ విహారి, ఆర్‌ఎం ఎస్‌బీఐ కృష్ణ కిషోర్, వివిధ బ్యాంకు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉత్పన్న కారాదు

జిల్లాలో తాగునీటి కొరత రాకూడదని, తాగునీరు కలుషితం అయిందని..ఏ ఒక్క ఫిర్యాదు అందినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధి తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల పురోగతిపై జేసీ అదితిసింగ్‌తో కలిసి డ్రింకింగ్ వాటర్- శానిటేషన్ మిషన్ కమిటీ సభ్యులైన ఆయా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సీపీఓ హజరతయ్య, ఆర్‌డబ్ల్యూస్ ఈఈ ఏడుకొండలు, పంచాయతీరాజ్, డీఆర్డీఏ, మెప్మా, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, భూగర్భజలాలు, ఫారెస్ట్ సబ్ డివిజన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రేపు రేబీస్ టీకా కార్యక్రమం

కడప అగ్రికల్చర్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కడప బహుళార్థ పశు వైద్యశాఖ(వెటర్నరీ పాలి క్లినిక్)లో ఉచిత రేబీస్ టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

పేదలపై దాతృత్వం

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులోని నారాయణ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అధినేత కొట్టే నారాయణరెడ్డి పేదలపై దాతృత్వం చాటుకున్నారు. గురువారం రాత్రి వేంపల్లె మండలం దుగ్గన్నగారిపల్లె గ్రామ సమీపంలో మోటార్ బైక్‌పై వెళ్తున్న బాసం గంగరాజు ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందారు. మరో వ్యక్తి బుసిరెడ్డి శివానందరెడ్డికి తీవ్రగాయాలవడంతో కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నారాయణ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్ నారాయణరెడ్డి శివానందరెడ్డి తల్లి రమణమ్మకు రూ.50 వేలు,ఉపాధ్యాయురాలు గురుసుబ్బమ్మ రూ.10 వేలు, ఉపాధ్యాయులు రూ.30 వేలు శివానందరెడ్డి తల్లికి అందజేశారు. గతంలో శివానందరెడ్డి నారాయణ పాఠశాలలో పీఈటీ మాస్టర్‌గా పనిచేశారని తెలిపారు.

స్కూటీ డిక్కీలో డబ్బు అపహరణ

వేంపల్లె : పట్టణంలోని పులివెందుల రోడ్డులో నిలిపిన స్కూటీ డిక్కీలో ఉన్న డబ్బును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితుడు బి.భాస్కర్‌రావు తెలిపారు. బాధితుడి కథనం మేరకు.. వేంపల్లె–కుప్పాలపల్లె రహదారిలో ఉర్దూ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న భాస్కర్ రావు శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లి రూ.10 వేలు డ్రా చేసి స్కూటీ డిక్కీలో పెట్టారు. అనంతరం ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం వద్ద స్కూటీ పెట్టి సూపర్ మార్కెట్‌లోకి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీ వద్దకు వచ్చి చాకచక్యంగా డిక్కీ తెరిచి డబ్బు దొంగలించారు. బాధితుడు బయటికి వచ్చి డిక్కీలో డబ్బు చూసుకోగా డబ్బుతోపాటు, చెక్‌బుక్, ఆఫీసుకు చెందిన పత్రాలు కూడా చోరీ చేసినట్లు బాధితుడు తెలిపారు.

మతి స్థిమితంలేని వ్యక్తి అదృశ్యం

పులివెందుల రూరల్ : పట్టణంలోని సరస్వతి విద్యా మందిరం సమీపంలో నివసిస్తున్న పార్వతమ్మ కుమారుడు శ్రీనివాసులు అదృశ్యమయ్యాడు. శ్రీనివాసులుకు మతిస్థిమితం లేకపోవడంతో పట్టణంలో యాచిస్తుండేవాడు. ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో శ్రీనివాసులు తల్లి పార్వతమ్మ పులివెందుల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే 9491246660 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఆలోచనకు పదును.. సృజనకు అదును

- ఇన్‌స్పైర్‌మనక్ -2025కు దరఖాస్తుల ఆహ్వానం
- బాల మేధావులకు గొప్ప అవకాశం
- సెప్టెంబర్ 15వ తేదీ వరకు నమోదుకు గడువు



జిల్లా సైన్సుఫేర్‌లో ప్రాజెక్టును ప్రదర్శించిన విద్యార్థులు (ఫైల్)

కడప ఎడ్యుకేషన్ : ఇన్‌స్పైర్ మనక్– 2005 అవార్డులకు వేళయింది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రయోగాల వైపు నడిపించి.. వారి చిట్టి బుర్రలకు పదునుపెట్టి... కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టి.. వారిని భావి భారత శాస్త్ర వేత్తలుగా తయారుచేయాలనే లక్ష్యంతోభాగంగా భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం(డీఎస్‌టీ) ఏటా విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జిల్లా స్థాయిలో ప్రతిభ చూసిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు బాల శాస్త్ర వేత్తలుగా నామకరణం చేసి రాష్ట్రపతి అవార్డు అందజేస్తారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు త్వరపడాల్సి ఉంది.

అర్హతలు... ఎంపికలు ఇలా

వైఎస్సార్ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, ఎయిడెడ్, ప్రైవేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తు చేసేందుకు అర్హులు. వారంతా తమ సైన్సు టీచర్‌ను గైడ్‌గా ఏర్పాటుచేసుకుని ఈ పరిశోధనలో పాల్గొనాల్సి ఉంటుంది. ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపిక చేస్తారు. స్థానిక సమస్యలను తీర్చే విధంగా ఆలోచనలుండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచన ఎంపిక చేసి అందుకు అవసరమైన ప్రాజెక్టు రూపొందించాలి. విద్యార్థి, తండ్రి పేర్లు, తరగతి నమోదు చేసి విద్యార్థికి సంబంధించిన బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు నెంబర్ ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు రాత పూర్వకంగా సంబంధిత వెబ్ సైట్‌లో నమోదు చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టు ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయి ప్రతిభా వంతులను ప్రకటిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగం నిమిత్తం బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమ చేస్తారు. ఈ దరఖాస్తుకు గడువు సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఉంది.

దరఖాస్తు చేసుకునే విధానం ఇలా...

ఇన్‌స్పైర్ అవార్డు మనాక్‌లో పాల్గొనేందుకు విద్యార్థులు ముందుగా www.inrpireawardrdrt.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. స్కూల్ అథారిటీ ఆప్షన్‌ను ఎంపిక చేయాలి. అందులో న్యూ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను ఎంపిక చేయాలి. పాఠశాల వివరాలను పొందుపరిచి సేవ్ చేయాలి. సంబంధిత దరఖాస్తు జిల్లా అథారిటీకి చేరుతుంది. ఆమోదించిన తరువాత మనం ఇచ్చిన మొయిల్ ఐడీకి యూజర్ ఐడితో కూడిన లింక్ వస్తుంది. ఆ ఐడీతో పాస్‌వర్డు క్రియేట్ చేయాలి. అనంతరం విద్యార్థుల ప్రాజెక్టు వివరాలను అందులో నమోదుచేయాలి.

జాగ్రత్తలు పాటించాలి...

విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టులలో స్థానిక సమస్యలను ప్రతిబింబించి.. వాటికి పరిష్కార మార్గాలు చూపేలా ఉండాలి. పాతవైనా తాజా పరిస్థితులకు అన్వయించి పరిష్కారం చూపాలి. నమూనాల పొడవు, వెడల్పు ఒక మీటరు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టు రిపోర్టులో నమూనా పరిచయం, పనిచేసే తీరు, ఉపయోగించే పరికరాలు, తయారీ విధానం, పనిచేసే తీరు. ఫలితాల అనువర్తనాలు తప్పని సరిగా ఉండాలి. ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చే న్యాయ నిర్ణేతలకు నమూనా చూపించి ప్రాజెక్టు గురించి తడబాటు లేకుండా వివరించాలి.

ఎంపిక పక్రియ...

విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు, నమూనాలను జిల్లా స్థాయి ప్రదర్శనలో ఉంచుతారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపుతారు. అక్కడ విజయం సాధిస్తే జాతీయ స్థాయిలో పదర్శించే అవకాశం కల్పిస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన వాటిని ఐఐటి, నీట్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలకు అప్పగిస్తారు. వాటిని వారు గొప్ప నమూనాలుగా రూపొందిస్తారు. ఉత్తమ ప్రదర్శనల నుంచి జాతీయ స్థాయిలో పదర్శనలకు అవకాశం ఉంటుంది. వీటిలో పలు ప్రాజెక్టులను ఫైనల్‌గా ఎంపిక చేసి రాష్ట్రపతి భవన్‌లో జరిగే వారోత్సవాల్లో ప్రదర్శిస్తారు. ఈ ప్రాజెక్టులకు ప్రభుత్వం పెటెంట్ హక్కులు మంజూరు చేస్తుంది.

ప్రతి పాఠశాల నుంచి...



ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది. ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు భాగస్వాములు కావాలి. ఇందులో ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇందుకు ప్రతి సైన్సు ఉపాధ్యాయుడు కృషి చేయాలి.

– ఎబినైజర్, జిల్లా సైన్సు అధికారి

విద్యార్థులను ప్రోత్సహించండి



ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే సైన్సు ఉపాధ్యాయులందరూ విద్యార్థులను ప్రోత్సహించాలి. ప్రాజెక్టుల రూపకల్పనలో వారి ఆలోచనలను పరిగణనలోకి తీసుకొని నూతనత్వాన్ని ప్రతిబింబించేలా ప్రాజెక్టు సిద్ధం చేసుకోవాలి. ఇందుకు అన్ని పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు కృషిచేయాలి. అనుమానాలుంటే జిల్లా సైన్సు అధికారిని సంప్రదించాలి.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి

యువతి హత్య కేసులో ముగ్గురు నిందితులకు జైలు

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా పోరుమామిళ్ల పీఎస్ పరిధిలో జరిగిన మతిస్థిమితం లేని యువతి హత్య కేసులో పోరుమామిళ్ల టౌన్ బెస్త వీధికి చెందిన షేక్ జిలానీ బాషా(26), కలసపాడు మండలం కట్టకిందపల్లికి చెందిన కారు నాగేంద్ర ప్రసాద్(25), పోరుమామిళ్లలోని తురకకోట వీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా(26) లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ కడప నాలుగో ఏడీజే కోర్టు జడ్జి జి.దీనాబాబు తీర్పు ఇచ్చారు. పోరుమామిళ్ల పీఎస్ పరిధిలోని రామాయపల్లి శ్మశానం వద్ద 2019 జూలై, 11న హత్య జరిగింది. ముగ్గురు నిందితులు మతిస్థిమితం లేని యువతిని గొంతు నులిమి హత్య చేశారు. అప్పటి వీఆర్‌ఓ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మోహన్‌రెడ్డి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో యువతి గొంతు నులిమి హత్యచేసినట్లు రుజువు కావడంతో శుక్రవారం ముగ్గురికీ పది సంవత్సరాల జైలు శిక్ష, రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. సీఐ మోహన్ రెడ్డి, సీఐడీ శ్రీనివాసులు, కొండారెడ్డి, వెంకట సుబ్బయ్యలను ఎస్పీ అభినందించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటనారాయణ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప భాకరాపేట రైల్వే స్టేషన్ మధ్య శుక్రవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. కడప రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి కథనం మేరకు ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలానికి చెందిన వెంకటనారాయణ పనినిమిత్తం గుంతకల్‌కు రైలులో వెళుతుండగా భాకరాపేట సమీపంలో ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు బలమైన గాయమైంది. విషయం తెలుసుకున్న కడప రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. గాయపడిన వ్యక్తిని కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

అప్పుల బాధతో ఆత్మహత్య

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ల మధ్య కొత్త మాధవరం సమీపంలో మల్లికార్జున(38) అనే వ్యక్తి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కడప రైల్వే పోలీసులు వివరాల మేరకు మల్లికార్జున ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద మేనేజర్ గా పని చేస్తుండే వాడు. రెండేళ్ల కిందట ఇల్లు కట్టుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో భరించలేక గురువారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోసం గ్యారెంటీపై ఇంటింటా ప్రచారం

- వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే తల్లికి వందనం అమలు
- భవిష్యత్తులో పార్టీ కార్యకర్తలకు పెద్దపీట
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవీంద్రనాథ్ రెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి, కొండూరు అజయ్ రెడ్డి

ప్రొద్దుటూరు : గ్రామం.. వార్డులలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై ఇంటింటికీ వెళ్లి తెలపాలని.. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ.. కార్యక్రమాన్ని నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుది చెత్త పరిపాలన అని, అబద్ధాలతో అధికారంలోకి వచ్చారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలుచేయని కారణంగా ఏడాదిలోనే వైఎస్సార్‌సీపీ మూడు పెద్ద కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. కరెంట్ చార్జీలు, రైతులకు మద్దతు ధర, వెన్నుపోటు కార్యక్రమాన్ని పెద్దస్థాయిలో నిర్వహించామన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోను అమలు చేయలేదనే విషయాన్ని ప్రతిపక్ష పార్టీగా గుర్తుచేస్తూ పోరాటం చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు అమలు చేయని పథకాలను.. తాను చేసినట్లు చూపిస్తున్నారన్నారు. గ్రామస్థాయి కార్యకర్తల నుంచి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వరకు అందరిపై దొంగ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని 143 రోజులు అక్రమంగా జైలులో ఉంచారన్నారు. ఈ ప్రభుత్వం ఎంతోకాలం ఉండదని, టీడీపీ నేతలను గుర్తించి బ్లూబుక్‌లో నమోదు చేయాలని కోరారు. 2.0 జగన్ పరిపాలనను మనమందరం చూస్తామని, అపుడు కార్యకర్తలకు పెద్ద పీట వేస్తామన్నారు. చంద్రబాబు తప్పులను గుర్తుచేస్తూ పార్టీని రక్షించుకునేందుకు నిత్యం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరిగిన మాట వాస్తవమేనని రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, భవిష్యత్తు అంతా కార్యకర్తలదేనన్నారు. ఏనాడు చంద్రబాబు చరిత్రలో పోరాటం చేసిన పరిస్థితి లేదన్నారు.

వైఎస్‌తో రాజకీయ ప్రస్థానం..

వైఎస్ రాజశేఖరరెడ్డితో చంద్రబాబు రాజకీయ ప్రస్థానం మొదలైందని, ఆయన కుమారుడు అయిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో ఆయన పరిపాలనకు శుభం కార్డు పడుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. 75 ఏళ్ల వయసులో చంద్రబాబు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. జగన్ పట్ల తాను అత్యంత విశ్వసనీయత కలిగి ఉన్నానని, ఆయన కోరితే దేనికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. 2028లో జమిలి ఎన్నికలు జరిగితే కూటమి ప్రభుత్వానికి ఓటమి తప్పదన్నారు. 2026లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ నుంచి అన్ని ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే దిశగా కృషి చేద్దామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఈ మూడు పార్టీలు విడిపోతే ఓడిపోతామనే భయం వారికి కల్పించింది మాత్రం జగనే అన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రతీకారంతో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు పనిచేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంట్ పరిశీలకుడు కొండూరు అజయ్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు ఇచ్చిన హామీలను తెలుసుకోవచ్చన్నారు. జగన్‌ను మళ్లీ సీఎం చేసుకునేందుకు సంఘటితంగా పోరాటం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా బాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ పోస్టర్లను ముఖ్య నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఇళ్లను సీజ్ చేస్తున్నట్లు నోటీసులు

బద్వేలు అర్బన్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కూటమి నేతల కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల బయనపల్లె గ్రామంలో ఇంటిని కూల్చిన ఘటన మరువకనే.. స్థానిక సిద్దవటం రోడ్డులోని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డికి ఇల్లు, ఆయన సమీప బంధువు సుబ్బారెడ్డికి చెందిన ఇంటిపై కన్నేశారు. వివరాల్లోకి వెళితే బద్వేల్ మండలం గొడుగునూరుకు చెందిన వంకెలచిన్నపోలిరెడ్డి, చింతలచెరువు గ్రామానికి చెందిన అంబవరంసుబ్బారెడ్డి 2011లో విద్యానగర్ సమీపంలో బీబీ ప్లాట్ కొనుగోలు చేశారు. ఇరువురు భవనం నిర్మించారు. మున్సిపల్ అధికారులు డోర్ నెంబర్లు కేటాయించారు. అయితే తాజాగా సదరు భవన యజమానులు నిర్మాణ అనుమతులను చట్టవిరుద్ధంగా అతిక్రమించి నిర్మించినందున ఏపీ మున్సిపల్ యాక్ట్ 1965 ప్రకారం సదరు ఇళ్లు సీజ్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి నోటీస్ పంపారు. ఇంటికి నోటీసు అంటించడంతో పాటు యజమానులకు నోటీసులు అందజేశారు.

నిబంధనల పేరుతో కుట్ర

మున్సిపల్ యాక్ట్ 1965లోని నిబంధనలను సాకుగా చూపి వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లకు నోటీసులు అందజేసినట్లు తెలుస్తోంది. 1965 యాక్ట్ ప్రకారం బహుళ అంతస్తు భవనానికి అనుమతులు లేకుండా నిర్మించినట్లు, ఇంటి ముందు, వెనుక ఖాళీ స్థలం వదలనట్లు, డ్రైనేజీ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టినట్లు, కొద్దిమేర రోడ్డు స్థలం ఆక్రమించినట్లు నోటీసులు అందజేశారు. పట్టణంలో కొన్ని వందల ఇళ్ళు ఇదే నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వారికి నోటీసులు ఇవ్వని అధికారులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారి ఇళ్లకు అతికించడం గమనార్హం.


బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న పద్మావతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ విధులు, ఆవశ్యకతను వివరిస్తూ బాలల హక్కులపై అవగాహన ఉండాలని సూచించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పిల్లల పట్ల సున్నితత్వంతో మెలగాలని, మౌలిక వసతులు మెరుగుపర్చాలని కోరారు. కంప్లైంట్ బాక్స్ నిర్వహించాలని, నిఅన్ని కమిటీల వివరాలు ఉండాలన్నారు. హక్కులను పర్యవేక్షించేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయి కమిషన్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఏవైనా లోపాలుంటే సవరించుకుంటూ ముందుకుసాగాలన్నారు. సమర్థంగా కర్తవ్యాన్ని నిర్వర్తించినప్పుడే బాలల భవితవ్యానికి బంగారు బాటలు వేసినట్లవుతుందన్నారు. చిన్నారుల సమస్యలను పరిష్కరించేందుకు 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డీడీ అంజల, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ హిదయతుల్లా, ఉమెన్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ బాలస్వామి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుభాష్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాహిర్



తాహీర్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న అలీషేర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడపకు చెందిన తాహిర్ నియమితులయ్యారు. కడప నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో ఆ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అలీషేర్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. గత 16 ఏళ్లుగా సామాజిక సేవలందిస్తూ విశేష గుర్తింపు పొందిన తాహిర్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తాహీర్ మాట్లాడుతూ కౌన్సిల్‌లో తనకు అప్పగించిన పదవికి తగిన న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ కడప జిల్లా అధ్యక్షుడు షాబుద్దీన్, కౌన్సిల్ రాష్ట్ర సలహాదారులు బషీర్‌బుఖారి, కౌన్సిల్ జిల్లా లీగల్ అడ్వైజర్ అలీమ్ అసద్, కౌన్సిల్ ప్రతినిధులు రియాజ్, జమీర్, రెడ్డి, అనూష, లక్ష్మీదేవి, సరస్వతి, గౌస్, సమీర్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

కడప అర్బన్ : అనుమానంతో భార్యను వేధింపులకు గురి చేస్తూ గొంతునులిమి హత్య చేసిన కేసులో నిందితుడైన భర్త జరిపిటి మల్లికార్జున(41)కు జీవిత ఖైదు, రూ. 1,60,000 జరిమానా విధిస్తూ జడ్జి జీఎస్.రమేష్‌కుమార్ తీర్పు ఇచ్చారు. తంబళ్లపల్లి మండలం మేకావారిపల్లికి చెందిన జరిపిటి మల్లికార్జునకు కడప ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన తమ్మిశెట్టి రమాదేవి కుమార్తె గంగాదేవితో 2012లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మల్లికార్జున పండ్లను విక్రయిస్తూ జీవించేవాడు. భార్య జరిపిటి గంగాదేవి(25)ని రోజూ అనుమానంతో వేధించాడు. 2019 మార్చి, 3న ఉదయం గొంతు నులిమి హత్య చేసినట్లు మృతురాలితల్లి తమ్మిశెట్టి రమాదేవి ఫిర్యాదు చేసింది. అప్పటి తాలూకా సీఐ ఎస్.విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి మల్లికార్జునను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో సాక్షాతో సహా నేరం నిరూపణ కావడంతో కడప కోర్టు జడ్జి మల్లికార్జునకు జీవిత ఖైదు, రూ.1,60,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. సీఐ టి.రెడ్డెప్ప, కోర్ట్ కానిస్టేబుల్ ఎం.రఘురాముడు, కోర్ట్ మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ రాజులను ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ అభినందించారు.

ఏసీఏ అండర్–19 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం



మన్విత్ రెడ్డి (14 పరుగులు)



షాహుల్ హుస్సేన్ (63 పరుగులు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజున వైఎస్సార్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు–చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మనిత్ రెడ్డి 167 బంతులో 16 ఫోర్లు, 5 సిక్సర్లతో 140 పరుగులు చేశాడు. సయ్యద్ షాహుల్ హుస్సేన్ 63 పరుగులు చేశాడు చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 3 వికెట్లు, ధనుష్‌రెడ్డి 3 వికెట్లు, తేజేష్2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 14 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో.....

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు –అనంతపురం జట్లు తలపడ్డాయి, ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 59.3 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 213 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని విష్ణు వర్ధన్ నాయుడు 68 పరుగులు, విఖ్యాత్ 4 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని నవదీప్ 4 వికెట్లు, టివి సాయి ప్రతాప్ రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 29 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 139 పరుగులు చేసింది. ఆ జట్టులోని కెహెచ్ వీరారెడ్డి 62 పరుగులు చేశాడు.

నిరవధిక నిరాహార దీక్షలకు సంఘీభావం



విద్యార్థులకు సంఘీభావం ప్రకటిస్తున్న దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్ : డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ట్(సీఓఏ) అనుమతి వెంటనే ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య డిమాండ్ చేశారు. ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మూడు రోజులుగా చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలకు శుక్రవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.350 కోట్లతో ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్శిటీని మంజూరు చేసిందన్నారు. రెగ్యులర్ ఫ్యాకల్టీ, సొంత భవనాలు, హాస్టల్ భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. యూనివర్సిటీకి డా. వైఎస్సార్ పేరుందనే ఈ ప్రభుత్వం కక్షసాధిస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, శివతేజ, అరుణ్‌కుమార్, ఎస్.రాజేష్, నజీర్, సుధీర్, చంద్ర, శివశంకర్, శ్రీనివాసులు, వెంకటేష్, ప్రశాంత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఏడీసెట్ నిర్వహించాలంటే ముందుగా కన్వీనర్, సభ్యులను ప్రభుత్వం నియమించాల్సి ఉందని ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ ఇన్‌చార్జి వీసీ విశ్వనాథ్ అన్నారు. వీలైనంత త్వరగా అన్నీ సమకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం



రాంమోహన్‌రావును సత్కరిస్తున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్య సభ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. వరుసగా ఎనిమిదో సారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బుశెట్టిరాంమోహన్‌రావు మాట్లాడుతూ ఆర్యవైశ్య సభ ఖ్యాతిని నలుదిశాల ఇనుమడింపచేస్తామని, దసరా ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడిగా బుశెట్టి రాంమోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా జొన్నలగడ్డ రవీంద్ర బాబు, కార్యదర్శిగా మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా మల్లెంకొండు ప్రతాప్, గౌరవ సభ్యులుగా వంకధార వీరభద్రయ్య, జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్, పోలేపల్లి రాజబాబు, రేగంటి సురేష్‌బాబు, మురికి మల్లికార్జునలతో పాటు 24 మంది సభ్యులతో సభ లీగల్ అడ్వయిజర్ కొప్పర్తి మధుసూదన్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాంమోహన్ రావును వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శాలువ కప్పి సత్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, పిట్టా బాలాజీ, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డిలతోపాటు పలువురినీ సత్కరించారు.